క్లుప్తంగా

బీజేపీ ఇంటింటి ప్రచారం



బుచ్చిరెడ్డిపాళెం: గృహ సంపర్క్ యోజనలో భాగంగా మండలంలోని పెనుబల్లిలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కాలం బుజ్జిరెడ్డి ఇంటింటికి వెళ్లి తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎంపీటీసీ వినయ్ నారాయణ, శ్రీనివాసయాదవ్, కిరణ్‌కుమార్, అనీల్‌కుమార్, శివకుమార్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు మోటార్‌సైకిల్ వేలం

కొడవలూరు: కోవూరు ఎస్‌ఈబీ స్టేషన్‌లో మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన టీవీఎస్ రైడర్ మోటార్‌సైకిల్‌ను సోమవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగంగా వేలం వేయనున్నట్లు కోవూరు ఎస్‌ఈబీ సీఐ ఆర్ నరహరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటార్‌సైకిల్ ధరను రూ.47 వేలుగా నిర్ణయించామన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా రూ.4,700 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వేడుకగా అశ్వవాహనసేవ



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై స్వామివారు ఆదివారం విహరించారు. ఉభయకర్తలుగా తురకా సురేష్, సునీత దంపతులు, పెళ్లకూరు రఘుకుమార్, మాధవీరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ఓరుగంటి వెంకటసుబ్రహ్మణ్యం, అనిల్‌కుమార్, కవిత వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా డాక్టర్స్ డే

నెల్లూరు(బృందావనం): డాక్టర్స్ డేను నగరంలోని పురమందిరంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆర్డీఓ మలోల, ఇన్ఫోటిక్ వైస్ ప్రెసిడెంట్ దేవేంద్ర, కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేరూరి ప్రదీప్ హాజరయ్యారు. డాక్టర్లు పెంచలరెడ్డి, నిశ్చలప్రసాద్‌రెడ్డి, వెంకటతరుణ్, రఘురామయ్య, రాము, దివ్యారెడ్డి, మారం సుధాకర్, రాకేష్, శ్రీవత్సవకుమార్, సత్యనారాయణ, తదితరులను సత్కరించారు. పవన్, నాగరాజు, ఐఎస్ రావు, మాధవి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

'దాహం.. దాహం' కవిత పరిచయ వేదిక



నెల్లూరు(బృందావనం): కవి చిన్ని నారాయణరావు రచించిన దాహం.. దాహం దీర్ఘ కవిత పరిచయ వేదికను పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆదివారం నిర్వహించారు. పెన్నా రచయితల సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కవితను రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నారాయణరావు నెల్లూరు సి.నా.రె అని కొనియాడారు. అనంతరం నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, మద్దూరు శ్రీనివాసులు, కవి ఏటూరు నాగేంద్రరావు (హైదరాబాద్), కవి కంచనపల్లి ద్వారకనాథ్ (తిరుపతి), కవి మోపూరు పెంచలనరసింహం, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని సత్కరించారు. తొలుత కవి సమ్మేళనం, కవితల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. యువ కవి సుంకర గోపాల్, కవి, విమర్శకుడు శ్రీరామకవచం సాగర్, ప్రముఖ సాహితీ విమర్శకుడు మేడిపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక నేడు

నెల్లూరు(దర్గామిట్ట): ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. సైదాపురంలో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. గూడూరు, నెల్లూరు మీదుగా కావలి చేరుకొని అక్కడి నుంచి గుంటూరు పయనమవనున్నారు.



➡ ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఎల్లు మల్లీశ్వరి. పడుగుపాడులోని దళితవాడలో నివాసం ఉంటున్నారు. ఆమె పక్కనే ఫొటోలో ఉన్న కుమార్తె కల్పైశ్రీ రెండో తరగతి చదువుతోంది. కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించే స్థోమత లేక పడుగుపాడులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. జగనన్న అమ్మఒడి నగదు జమచేస్తుండడంతో కుమార్తెను ఇబ్బంది లేకుండా చదివించగలుగుతున్నారని ఆమె సంతోషంగా చెబుతోంది.



➡ ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బొచ్చు నాగభూషణమ్మ. పడుగుపాడు ఎస్సీ కాలనీలో నివాసం ఉంటోంది. ఆమె పక్కనే ఫొటోలో కనిపిస్తున్న కుమార్తె బీ పద్మిని 8వ తరగతి చదువుతోంది. కార్పొరేట్ స్కూళ్లలో చదివించే స్థోమత లేక బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో చేర్పించి చదివిస్తున్నారు. గతంలో బడులు తెరిచే సమయంలో దుస్తులు, పుస్తకాలు, తదితర ఖర్చులకు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం జగనన్న అమ్మఒడి నగదు ఖాతాలో జమ చేస్తుండడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా కుమార్తెను చదివిస్తున్నానని నాగభూషణమ్మ సంతోషంగా చెబుతోంది.



➡ ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు షేక్ సల్మా. పడుగుపాడులో నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ఒకరు రెండు, మరొకరు ఆరో తరగతి చదువుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లల్లో చేర్పించి చదివించే స్థోమత లేక పడుగుపాడులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. గతంలో జూన్ నెల వచ్చిందంటే పిల్లల బ్యాగులు, పుస్తకాలు, దుస్తులు, తదితర ఖర్చులకు ఏం చేయాలని భయపడేవారు. ప్రస్తుతం జగనన్న అమ్మఒడి నగదు అందజేస్తుండడంతో జూన్ నెల భయంపోయిందని సల్మా చెబుతోంది.

పేదింట విద్యా కాంతులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. పేదింటి బిడ్డలు చదువుకు ఇబ్బందులు పడకూడదని ఏటా క్రమం తప్పకుండా అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.15వేలు నగదు జమ చేస్తున్నారు. ఈ నిధులు పిల్లల చదువులకు కొండంత అండగా నిలుస్తున్నాయి.



కోవూరులోని పచ్చిపాల రామనాథం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల

కోవూరు: పేదరికం చదువుకు శాపం కాకూడదు. ప్రతి విద్యార్థి చదుకోవాలి..చదువుతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని విశ్వసించారు వైఎస్సార్. అందుకే ఆయన సీఎంగా పాలనా పగ్గాలు చేపట్టిన తరువాత విద్యార్థుల కోసం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని రూపొందించి ప్రాణంపోశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు ఇంజినీర్లు, వైద్యులుగా దేశవిదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. కానీ ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేశాయి. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యకు పెద్దపీట వేస్తూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తూ మెరుగైన విద్యాబోధన అందిస్తున్నారు. మరోవైపు పేదలు ఆర్థిక స్థోమత లేక తమ పిల్లలను బడులకు పంపడం లేదని గుర్తించి అమ్మఒడి పథకానికి రూపకల్పన చేశారు. ఏటా క్రమం తప్పకుండా తల్లుల ఖాతాల్లో రూ.15వేలు జమ చేస్తూ కొండంత అండగా నిలుస్తున్నారు.

22,012 మందికి లబ్ధి

కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి అమ్మఒడి పథకం నాల్గో విడత కింద 22,012 మంది తల్లుల ఖాతాల్లో రూ.28.61 కోట్లు జమచేశారు. మండలాల వారీగా పరిశీలిస్తే కోవూరు 6,074, ఇందుకూరుపేట 4,707, విడవలూరు 4,118, కొడవలూరు 3,785, బుచ్చిరెడ్డిపాళెం 3,328 మంది తల్లుల ఖాతాల్లో అమ్మఒడి నగదు జమచేశారు.

డ్రాపౌట్స్ సంఖ్య తగ్గింది



ప్రభుత్వ అమలు చేస్తున్న జగనన్న అమ్మఒడి పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గింది. అమ్మఒడి నగదుకు విద్యార్థుల హాజరును లింక్ చేయడంతో తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పంపిస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యాబోధన అందిస్తుండడంతో అడ్మిషన్లు పెరిగాయి.

–షేక్ రహీం, ఎంఈఓ, కోవూరు

కామాక్షితాయి సేవలో కొడవలూరు



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయిని ప్రముఖ పారిశ్రామిక వేత్త కొడవలూరు ధనుంజయరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుంజయరెడ్డిని ఆలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపట్నుంచి జగనన్న సురక్ష క్యాంపులు

కొడవలూరు: మండలంలోని సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న కొడవలూరు, గుండాలమ్మపాళెం, 6న యల్లాయపాళెం 1,2, 8న దామేగుంట, రేగడిచెలిక, 13న కమ్మపాళెం, గండవరం, 15న తలమంచి, గౌతమ్‌నగర్, 18న నార్తురాజుపాళెం 1,2, 20న కొత్తవంగల్లు, 25న మిక్కిలింపేట సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయని వివరించారు. క్యాంపుల్లో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో సచివాలయాల పరిధిలోని ప్రజలు అందుబాటులో ఉండి అవసరమైన సర్టిఫికెట్లను పొందాలని కోరారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ



ట్రైసైకిల్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరుకు చెందిన దివ్యాంగుడికి ఉగ్గాల కోటయ్యకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌ను వితరణ చేశారు. తన తండ్రి శ్రీనల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.35వేల విలువైన ట్రైసైకిల్‌ను ఏపీఎల్‌డీపీ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ ద్వారా లబ్ధిదారుడికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరిగొండ బాబయ్య, నాయుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గౌస్‌బాషా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు ఇస్కపాళెంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్ అందె ప్రత్యూష ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 3వ వార్డులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు సిమెంట్‌రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేయగా రూ.5 లక్షలు కేటాయించారని చెప్పారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేయడంతో పాటు డ్రైనేజీని నిర్మిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, రంజిత్, ఫయాజ్ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ఈ-కేవైసీ గడువు పొడిగింపు

కొడవలూరు: పీఎం కిసాన్ ఈ–కేవైసీ గడువును నెలాఖరు వరకు పొడిగించినట్లు ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3,600 మంది రైతులు ఉండగా, ఇంకా 400 మంది ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వేలిముద్రలు పడని కారణంగా ఈ–కేవైసీ చేయించుకోని రైతులకు ముఖగుర్తింపు ద్వారా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ కేవైసీ చేయించుకుంటేనే పీఎం కిసాన్ నగదు అందుతుందని చెప్పారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా కుంకాళమ్మ గ్రామోత్సవం

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరులో కొలువైన కుంకాళమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కుంకాళమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కుంకాళమ్మను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా మెట్టా చంద్రారెడ్డి,సుశీలమ్మ దంపతులు వ్యవహరించారు. అనంతరం గంగమ్మ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా కాటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, భార్గవి దంపతులు వ్యవహరించారు.

లోకోస్ యాప్‌లో నమోదు కావాలి



పొదుపు లీడర్లకు సూచనలు ఇస్తున్న ఏపీఎం రుక్మిణి

కొడవలూరు: ప్రతి పొదుపు సభ్యురాలు విధిగా 'లోకోస్' యాప్‌లో నమోదు కావాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్ రుక్మిణి సూచించారు. కొడవలూరులో పొదుపు గ్రూపుల లీడర్లతో ఆదివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పొదుపు సభ్యురాలు ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్‌తో లోకోస్ యాప్‌లోని ఎన్‌ఆర్‌ఎల్‌ఎం(నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్)లో నమోదు కావాలన్నారు. ఇందులో నమోదైన సభ్యులే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు పొందేందుకు అర్హులవుతారని చెప్పారు. మండలంలో 1255 పొదుపు గ్రూపులు ఉండగా, ఇప్పటి వరకు 650 గ్రూపులకు సంబంధించిన సభ్యులు మాత్రమే లోకోస్‌లో నమోదయ్యారని తెలిపారు. మిగిలిన వారంతా వారంలో నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. యాప్‌లో నమోదు సమయంలో పొదుపు సభ్యుల ఫొటోను తీయాల్సి ఉన్నందున విధిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీ కే ఉదయ్‌కుమార్, వీఓఏ జీ కవిత, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ. లక్ష విరాళం



పొదలకూరు : పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరానికి టీ సుబ్బరామనాయుడు దంపతులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా చేపట్టనున్న అన్నప్రసాద వితరణ కోసం నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరామనాయుడు దంపతుల పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.సాయిబాబా మందిరం చైర్మన్ చీమకుర్తి రాజగోపాల్, సభ్యులు దేవరం రఘురామిరెడ్డి, లక్కాకుల ఆనందరావు, తరుగు ప్రభాకర్, చాగలేటి శ్రీహరి, కే కోటేశ్వరరావు, కదిరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షణ సైన్యం వ్యవస్థాపక దినోత్సవం



బుచ్చిరెడ్డిపాళెంలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని రక్షణసైన్యం క్రైస్తవ ప్రార్థనా మందిరంలో 158వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరం ఆవరణంలో సంఘ పెద్దలు దిలీప్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దైవ సందేశకులు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జనరల్ విలియం బూత్ కేథరిన్ బూత్‌లు 158 ఏళ్ల క్రితం రక్షణ సైన్యాన్ని స్థాపించి పేదలకు సేవా కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టారు. రేబాలలోని రక్షణ సైన్యం చర్చిలోనూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతికుమారి, జాన్ శామ్యూల్ పాల్గొన్నారు.

వైభవంగా ఆర్వేటమ్మ జాతర



కోవూరు: మండలంలోని వేగూరులో గ్రామదేవత ఆర్వేటమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పుట్ట బంగారం, మైలు పల్లకి, గంగపెట్టె, వీరతాళ్లు, గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తుమ్మలపెంట చంద్ర, మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠ్యాంశాల తొలగింపు దారుణం

నెల్లూరు (టౌన్): పాఠ్య పుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతం, మూలకాల పట్టిక, తదితరాల తొలగింపు దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని యూటీఎఫ్, జేవీవీ, ఉద్యోగ, ఉపాధ్యాయ పింఛనర్లు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాలేషాబాషా, ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు చలపతి, ఎస్టీయూ జిల్లా నేత రాజమనోహర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, మోడల్ స్కూల్స్ అసోసియేషన్ నేతలు జయరామ్, జేవీవీ నేత బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

చకచకా అదనపు భవనం పనులు

బుచ్చిరెడ్డిపాళెం సామాజిక ఆరోగ్యకేంద్రంలో మరో 30 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం నాబార్డు నిధులు దాదాపు రూ.3.15 కోట్లతో చేపడుతున్న అదనపు భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో నెల రోజుల వ్యవధిలో అదనపు గదులను ప్రారంభించి రోగులకు సౌకర్యవంతమైన వైద్యసేవలు అందించనున్నారు.



నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనం

- నాబార్డు నిధులు రూ.3.15కోట్లతో పనులు
- మరో నెలరోజుల్లో ప్రారంభం
- సీహెచ్‌సీలో అందుబాటులోకి రానున్న మరో 30 పడకలు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అదనపు భవన నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.3.15 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటి వరకు సీహెచ్‌సీలో 30 పడకలు ఉండగా, అదనపు భవన నిర్మాణంతో మరో 30 పడకలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో బుచ్చిరెడ్డిపాళెంతో పాటు సంగం, దగదర్తి మండలాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

సీహెచ్‌సీ అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీ అభివృద్ధిపై కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. దాదాపు మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీలో మరిన్ని వసతులు కల్పించాలని 2020లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కరోనా కష్టకాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీలో మరో 30 పడకలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాబార్డు నుంచి రూ.3.15 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అదనపు భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మరో నెలరోజుల్లో భవనాన్ని రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.



బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీ

సంతోషకరం



బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీలో రూ.3.15కోట్లతో ప్రభుత్వం అదనపు భవన నిర్మాణం చేపట్టడం సంతోషకరం. అదనపు భవన నిర్మాణంతో మరో 30 పడకలు అందుబాటులోకి రానున్నాయి. అదనపు భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవచూపి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– చెర్లో సతీష్‌రెడ్డి, ఆస్పత్రి కమిటీ సభ్యులు

రోగులకు మెరుగైన సేవలు



తమ వార్డు పరిధిలోని సీహెచ్‌సీలో చేపడుతున్న అదనపు భవన నిర్మాణ పనులు దాదాపు పూర్త య్యాయి. అదనపు భవన నిర్మాణం ప్రారంభంతో మరో 30 పడకలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా రోగులకు మెరుగైన సేవలు అందనున్నాయి.

– బిట్రగుంట ప్రమీలమ్మ, కౌన్సిలర్

నెల రోజుల వ్యవధిలో అందుబాటులోకి

సీహెచ్‌సీలో నిర్మిస్తున్న అదనపు భవనం పనులను వేగవంతం చేశాం. ఇప్పటి వరకు దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన చిన్నపాటి పనులను నెలరోజుల్లోగా పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకొస్తాం. దీంతో మరో 30 పడకలు రోగులకు అందుబాటులోకి వస్తాయి.

–సాంబశివరావు, డీఈ, ఏపీఎంఎస్ఐడీసీ.